
శ్రీదేవి

శ్రీవారు క్యాంపుకు వెళ్తానని అరగంట క్రితమే బయల్దేరి వెళ్ళారు. టాల్‌స్టాయ్ 'అన్నా కెరినినా' చెదువుతూ కూర్చున్నాను యేం తోచక. హానీ, గిరీ పై చదువులకు వెళ్లి, బిందు పెళ్ళయి అత్తారింటికి వెళ్లిపోయాక కాలం గడవడమే కష్టమైపోతున్నది. ఎన్ని పనులు కలిపించుకున్నా, ఎన్ని పుస్తకాలు చదివినా- బిరువుగా కాలం గడుస్తున్నది-ఆలోచనలు తేనె టీగల్లా-ముసురుకుని-మనసంతా అల్లకల్లోలమై పోయింది.

టాల్‌స్టాయ్ సృష్టి-అన్నా - స్త్రీలోని బల హీనతకూ-ప్రేమకూ ఆరాధనకూ లొంగిపోయి శలభాల్లా మాడిపోయే - స్త్రీజాతికి - ప్రతీక-అన్పిస్తోంది. మన భారతీయ మహిళకే కాదు — సాంఘికపరమైన కట్టు బాట్లూ - విలువలూ- పాశ్చాత్యదేశాల్లో కూడ స్త్రీ జీవితం - పురుషుని జీవితానికి పూర్తిగా భిన్నంగా - ముఖ్యంగా సంఘ నియమాలకు కట్టుబడి బ్రతక్క తప్ప దన్న సత్యాన్ని - చక్కగా చిత్రించాడు రచయిత.

'అన్నా' కారెక్టరు చదువుతుంటే - మన సంతా భారంగా అనిపించింది. ఆ నాడు-నేనూ- కృష్ణా యెలాంటి సాహసం చేసినా-యీ నాడు నేనూ మరో 'అన్నా' అయ్యుండే దాన్నేమో!

కృష్ణ గురించిన ఆలోచనలు రాగానే—



గుండెల్లో గుబులంతా పైకుబికింది. అది ఆనందమో, ఆవేదనో తెలీని యేదో తీయని బాధ. గతస్మృతుల పరిమళం గుప్పున గుబాళించబోయే తరుణాన. .

"టింగ్-టింగ్-"అంటూఫోను ఎక్కడిదో-విసుగా లేచి అందుకున్నాను.

"హలో నేనేనోయ్ లతను. ఏమిటి పరధ్యానం. శ్రీహరి ధ్యానంలో మునిగిపోయావేమిటి?" నువ్వు—

"అబ్బే-అదేంలేదు-ఏదో పుస్తకం చదువుతూ పరధ్యానంలో పడిపోయానులే కానీ—యేమిటి విశేషాలు?"

"విశేషాలేం లేవుగానీ-కృష్ణ వచ్చాడు—మీ గురించి వివరాలడిగినాడు-చెప్పాను—మీరీ వూళ్లోనే వుంటున్నట్లు-అడ్రసిచ్చాను—మళ్ళీ రాత్రికే వెళ్లి పోతానంటున్నాడు. ఇక్కడనుంచి మీ యింటికి వస్తానన్నాడు-నీవింట్లోనే వుంటావని-ముందుగా చెప్తున్నాను-మరి వుంటావు కదూ!—"

"అలాగే-అలాగే-రమ్మను తప్పక-మావారు క్యాంపుకు వెళ్ళారు. యేంతోచడంకూడా లేదు" అదే మరొకప్పుడయితే "నీవూ రావాలి" అనే దాన్నే లతతో-కానీ-యీనాడు కృష్ణను యేకాంతంగా కలుసుకుని-సంవత్సరాల తరబడి అల్లుకున్న ఆశలను-ఆలోచనలను మాటల రూపంలో అతనిముందు పెట్టాలన్న స్వార్థం-లతమీది అభిమానాన్ని చంపేసింది.

అవతల ఫోన్ పెట్టేసిన చప్పుడు-యోచనా స్రవంతికి ఆనకట్ట కట్టింది.

విచిత్రం-ఆశ్చర్యం ఇప్పుడప్పుడే కృష్ణను గూర్చిన తలంపులు ఇంతలో హఠాత్తుగా అతన్ని కలిసే అవకాశం. పన్నెండేళ్ళ నుండి నాలో వూపిరి పోసుకుంటున్న వూహలు—కార్యరూపం దాల్చలేని కోరికలు-అన్నీ నన్ను వుక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. జీవితంలో లభించిన యీ సదవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. కనీసం కొన్ని నిముషాల పాటైనా యీ సమాజాన్నీ, బాధ్యతల బరువునీ బంధాల్నీ కట్టుబాట్లనూ అన్నీ త్యజించాలి. ఇద్దరం ఒకరికొకరుగా నీవు నేను అనే భేదం లేకుండా పూవూ, తావిలా హాయిగా జీవితాన్ని ఆస్వాదించాలి.

వెంటనే నవ్వొచ్చింది నా ఆలోచనలకు.

వయస్సు గుర్తుచేసింది మనసు-

ఈ వయసులో పిల్లల తల్లిగా—నాలుగు పదులు నిండిన యీ సమయాన—యింకా యిలాంటి పిచ్చేమిటి?

అసలు-నా జీవితమే ఒక విచిత్రం-

పుట్టింది సంప్రదాయాలకే విలువనిచ్చే—సనాతన కుటుంబం. ఆలోచనలు ఆధునికమైనవి. ప్రేమ, వాత్సల్యం, కరుణ ఎన్ని పాళ్ళల్లో వున్నాయో అంతే వున్నాయి ద్వేషం రోషం, తొందరపాటు.

సహజంగా అందరితో కలిసిపోయి—కలివిడిగా వుండే స్వభావం. కుండ బద్దలు కొట్టినట్లు ఎవరితోనైనా సరే మాట్లాడి 'యదార్థ వాదీ లోక విరోధీ' అన్న సామెతను ఋజువు చేసే స్వభావం. మంచి అనుకుంటే - వాళ్ళను అతిగా నమ్మేయడం-విపరీతంగా ఆరాధించడం. ఎవరేనా అనవసరంగా ఏదైనా అంటే నొచ్చుకుని బాధపడిపోవడం-కడివెడు కన్నీళ్ళు కార్చి బాధనంతా వెళ్ళగక్కుకోవడం సరదాగా చదవడం ఆరంభించి నిత్యకృత్యాలలో ఒకటైపోయిన పుస్తకపఠనం కలిగించిన లోకజ్ఞానం. కష్టాల్లోవున్నవాళ్ళ నాదుకోవాలనే సేవాభావం—

యౌవన ప్రాంగణంలో అడుగు పెట్టీపెట్టక ముందే అమాయకంగా - వివాహితుడైన ఒక ధీరుడుకు హృదయాన్నర్పించి అపాత్రదానం చేసి ఆ తీవ్రాఘాతానికి తట్టుకోలేక విరిసీ విరియని మొగ్గలా రాలిపోయే తరుణాన తనలో రగులుతున్న అగ్నిని కనిపెట్టలేని తలిదండ్రులు వరాన్వేషణ చేశారు. సడలించలేని సాంఘిక విలువలను తోసెయ్యలేక వివాహమంటేనే అయిష్టత యేర్పడ్డ తాను తన తర్వాతి ఆడపిల్లల భవిష్యత్తుకు అడ్డుగోడ కాకూడదనే ధ్యేయంతో వివాహానికి వొప్పలేక తప్పలేదు.

తన జీవితంలో ప్రవేశించిన శ్రీహరి ఎంతో సౌమ్యుడు, ఉత్తముడు. గతంలోని పీడ కలలను దాదాపు దూరంచేయగలిగింది అతని

సాహచర్యం.

ఉద్యోగ నిర్వహణ అయిపోయాక యిక అతనికి తనతోడిదే లోకమైంది. కదిలిస్తే కంది పోతానన్నంత అపురూపం - నేనేది చెప్పినా ఆజ్ఞలా భావించి శిరసావహించే మెత్తదనం. అనుక్షణమూ నా కోసమే తాననే భావన——

"జీవితమంతా మనిద్దరం యిలాగే హాయిగా చిన్నపిల్లల్లా గడపాలి వసూ!" అన్న అభ్యర్థన.

ఆ అమాయకుణ్ణి మోసం చేస్తున్నానన్న భావన ముల్లులా గుచ్చుకోగా తన తప్పును తెలియబరిస్తే "గతం గురించి మాట్లాడకు వసూ! నా అదృష్టవశాత్తూ - నీవు నాకు లభించావు-భవిష్యత్తులో మాత్రం నీవు పూర్తిగా నాదానివిగా వుండాలి-నీలోని ప్రతి అణువూ నాలో ఐక్యం కావాలి. ఈ విషయంలో మాత్రం నేను పూర్తిగా స్వార్థపరుణ్ణి సుమా!" అన్న హృదయవైశాల్యం-నిజాయితీ——

కానీ-కానీ-ఎక్కడో - ఏదో అసంతృప్తి-అన్నీవున్నా యేదో లేదనే భావం. ఇంకా ఏదో కావాలనే కోరిక-

వంటపనుల్లో యింటిపనుల్లో సాయం చేస్తూ-అవకాశం వున్నప్పుడంతా తన్నే అంటిపెట్టుకుని వుంటూ తనకు చిన్న పిసరు అనారోగ్యం చేస్తే యెలాంటి సేవ అయినా చేయడానికి తయారయ్యే వారిని చూస్తే నా హృదయం కృతజ్ఞతాభావంతో నిండిపోయేది. అతనిలో నాకు మంచి సంరక్షకుడు-ఒక్కోసారి పితృప్రేమ కన్పించేవి. అంతేకానీ అతనిలో లీనమైపోవాలనీ అతనే నా సర్వసం కావాలనే కోరిక ఏ నాడూ కలగలేదు.

శరీరాలతో పాటు-మనసులు కూడా యేకం కావలసిన తరుణాన——

నా మనసెక్కడో విహరిస్తూ వుండేది. ముభావంగా - యాంత్రికంగా అతన్ని సుఖపెట్టాలని ప్రయత్నమే తప్ప నాలో యెలాంటి స్పందనా కలిగేది కాదు.

శారీరికంగా అతనికి లొంగిపోయినా—— అతను తన శరీరాన్ని ప్రతి అవయవమూ స్పృశిస్తూ——

"నీవెందుకింత డల్‌గా వుంటావు వసూ!-నేనంటే నీ కిష్టంలేదా-లేక సెక్సంటే అయిష్టమా" అన్న ప్రశ్నకు యేమి చెప్పాలో తెలీని అయోమయావస్థ "మీరన్నా సెక్సన్నా నాకేం అయిష్టంలేదు-కానీ-మీ దగ్గరకు వస్తే నేను వుత్సాహాన్ని పొందడం లేదు-మీ మనసు నన్ను జయించలేకపోతున్నది" అని చెప్పాలని అనుకున్నా చెప్పలేక పోయానెప్పుడూ.

మనసులు కలిసినా కలవకున్నా యెలాంటి ప్రత్యేకమైన భావాలు ఒకరిపట్ల మరొకరికెలాంటి ప్రత్యేకమైన అభిమానం వున్నా లేకపోయినా-మన వ్యవస్థ పుణ్యామా అని వివాహితులైన వారి జీవితం సాఫీగా నడిచిపోయినట్లే వుంటుంది. లోపల ఎన్ని అభిప్రాయా భేదాలున్నా ఒకరినొకరు ద్వేషించుకుంటున్నా—— లోకం దృష్టిలో ఆదర్శప్రాయమైన జంటగా గుర్తింపబడ్డం యేమంత కష్టంకాదు.

అందరు భార్యాభర్తల్లాగే మా జీవితమూ యాంత్రికంగా —— సర్వసామాన్యంగా ఆర్థిక సంబంధమైన కొన్ని చిన్నచిన్న ఇబ్బందులు తప్ప మరే ఒడిదుడుకులు లేకుండా నడుస్తున్నది. నాలో రోజురోజుకూ అకారణంగా పేరుకుపోతున్న అసంతృప్తీ-విసుగుదలా—— జీవితంపట్ల విరక్తి ఎందుకో నాకే అర్థం అయ్యేది కాదు. మానసికంగా ఆందోళన పడుతున్న నేను శారీరకంగా కూడ బలహీనంగా తయారయ్యాను. వరుసగా-దగ్గరదగ్గర పురుళ్లు-ఆయన జీతం చాలని పరిస్థితి-నన్ను మరీ కుంగదీసింది.

ఆయన డ్యూటీపై వెళ్ళగానే-పిల్లలు బడికి వెళ్తే-ఒంటరినై వివిధ రకాలుగా ఆలోచిస్తూ గడిపే నేను ఆయన మంచితనంతో ఆయన సాహచర్యంతో కొంతవరకూ కోలుకున్నాను. ఆర్థికంగా ఆయన కేవిధంగానైనా సాయం చేయగలిగితే బాగుండునన్న ఆలోచన వచ్చి ఆయన్ని వొప్పించాను.

అతి ప్రయాసతో వుద్యోగం సంపాదించగలిగాము. నేనేనాడో చదివిన బి.యాడి యీనాటికి వుపయోగపడిందని ఆనందించాం యిద్దరమూ.

ఉద్యోగంవల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగవుతుందనీ యిద్దరం హాయిగా పిల్లలను చదివించి వృద్ధిలోకి తీసుకురావచ్చనీ-ఆశించామే కానీ-ఆ వుద్యోగమే నాలోని భావుకతనూ, అణచుకోలేని ఆవేశాన్నీ రెచ్చగొట్టి నిశ్చలమైన తటాకంలో రాయి విసిరినట్లు మా జీవితంలో ఒడిదుడుకులను కల్పిస్తుందని యే నాడూ వూహించలేదు.

అసలు నేను వుద్యోగంలో చేరగానే— హెడ్‌మాస్టారి సీటులోవున్న వ్యక్తిని చూడ గానే అతన్ని ఇదివరకెక్కడో చూసినట్లు— ఎంతోకాలం నుంచీ అతని పరిచయం కలిగి వున్నట్లు అన్పించింది.

అదో చిన్నస్కూలు. ఆ స్కూల్లోవున్న వుపాధ్యాయులందరిలోకీ అంతోయింతో బాగా చదువుకున్నవాళ్ళము, పుస్తకపఠనమంటే అంతో యింతో ఆసక్తిగలవాళ్ళం మేమే అవడంవల్ల మా పరిచయం పెరిగిపోయింది. అంతేకాదు వుద్యోగ నిర్వహణలో యిద్దరివీ ఒకటే భావాలు, ఒకటే పద్ధతులు. ఒకరినొకరు మన్నించుకుని హాయిగా ఖాళీ దొరికినప్పుడల్లా యేదో చర్చలతో గడిపేవాళ్ళం.

అలా అలా దినదిన ప్రవర్థమానమైన మా పరిచయం స్నేహంగా మారింది. మా యింట్లో ఎలాంటి అభ్యంతరాలూ లేవు కనుక తను మా యింటికి తరచు వచ్చేవాడు - గంటల తరబడి చర్చలు వాగ్వాదాలు-అతనితో మాట్లాడు తుంటే అతన్నే చూస్తుంటే జీవితమంతా హాయిగా గడిచిపోతుందన్న భావన నాలో కలుగకపోలేదప్పుడప్పుడూ. మూడు వసంతాలు దొర్లాయి. భర్త నాపట్ల చూపిన అచంచల విశ్వాసం, ఆయన నాకిచ్చిన సంపూర్ణ స్వాతం త్ర్యాన్ని నేను నిలుపుకోలేకపోయాను.

ఆనాడు జీవితంలో మరెన్నడూ మరచి పోలేని ఆ సంధ్యాసమయంలో సన్నగా చిన్నగా లలిత సంగీతం ఆలాపిస్తున్న వింజమూరి శివరామారావుగారికంఠమాధుర్యాన్నిగ్రోలుతూ- ఒకరికెదురుగా మరొకరు కూర్చున్న వేళ-

కృష్ణ నాచేతికందించిన చిన్నకాగితాన్ని అందుకున్నాను ఆశ్చర్యంగా-

"మిమ్మల్ని నేను విపరీతంగా అభిమానిస్తు న్నాను-వసుమతిగారూ" అన్న ఆ వాక్యాలు మళ్ళీ మళ్ళీ చదివాను.

నేనూ చెప్పాలని ప్రయత్నించీ చెప్పలేని ఆ వాక్యాలు నిజమనిపించాయి.

నేను మన ప్రాచీన పతివ్రతామతల్లుల జాతికే చెందినదాన్నయితే సంప్రదాయపు ముసుగులో మనసులోని బలహీనతల్ని దాచు కుని నీతి అనీ, ద్రోహమనీ భావించినట్లైతే—

"నేనూ మిమ్మల్ని అభిమానిస్తున్నాను కృష్ణా - అయితే అన్నయ్యలా" అని చెప్పే దాన్నేమో!

కానీ-నా మనసును నేనే వంచించుకోలేక హృదయోద్వేగాన్ని అదుపులో పెట్టుకోలేక పోయాను. కృష్ణ వెళ్ళిపోయినా అతను వ్రాసిన వాక్యాలు నన్ను వెంటాడుతూనే వున్నాయి రాత్రంతా. రాత్రంతా నిద్రంటే ఏమిటో తెలి యని నేను-ముభావంగా యేదో ఆలోచిస్తున్న నన్ను-చూచి-అదేమిటో అర్థంకాక - అడిగితే ఏమి వినుక్కుంటానో అని తటపటాయిస్తూ-

"నిద్ర రాలేదా వసూ!" అంటూ పైన చేయి వేయబోతే సున్నితంగా చెయ్యి తీసివేస్తూ అన్నాను "వొంట్లో బాగులేదు."

"ఏమిటి తలనొప్పా - అమృతాంజనం తేనా" ఆదుర్దాగా అడిగారు.

"ఏమీ వద్దు-కాస్సేపు నన్ను పలకరించ కండి" అంటూ దూరంగా జరిగాను.

ఇలాంటి సమయాల్లో నన్ను ఇంకా పలక రిస్తే పర్యవసాన మేమిటో వారికి బాగా తెలుసు యీ పదేళ్ళ అనుభవంతోను.

మెదలకుండా పడుకున్నారు.

మరునాడు యెంతో ఆలోచించి, ఆలోచించి నా ఆలోచనలు కాగితంపై పెట్టాను.

అద్భుతగా చూస్తున్నట్లు కృష్ణ చూపులే చెప్తున్నాయి.

"నిన్న మీరు వ్రాసినట్టే నేనూ మిమ్మ ల్నెంతో అభిమానిస్తున్నాను. కానీ యివన్నీ యెవరితో చెప్పలేని, చెప్పుకోరాని భావాలు.




సంఘం దృష్టిలో యిలాంటి ఆలోచనలే తప్పు కానీ నేను మిమ్మల్ని చూడకుండా - మీతో మాట్లాడకుండా వుండలేకపోతున్నాను కృష్ణ గారూ

ఆ తర్వాత కృష్ణనుండీ మళ్ళీ వుత్తరం తను కూడా నా గురించి అలాంటి భావాలు కలిగి వుండడం అపచారంగా భావిస్తున్నాననీ, కానీ నిజం దాచుకోలేక మనసు విప్పి చెప్పాననీ దాని సారాంశం

క్రమంగా మా యిద్దరి మధ్య వుత్తర ప్రత్యుత్తరాలు-బడిలో - చూపులతో సంభాషణలు, సాయంకాలాల్లో మా యింటి దగ్గర సమావేశాలు అతను నాపై అధికారి అనే భావనే లేదు నాలో పరాయి వ్యక్తి అన్న మాటే లేదు నాలో కానీ డ్యూటీ విషయంలో మాత్రం ఎప్పటిలా ఖచ్చితంగా-వేలెత్తి చూపలేని రీతిగా కార్యక్రమాలు నిర్వర్తించేవారం

ఎన్నడూ లేనిది మావారిలో కోపం, విసుగు కన్పించసాగేయి నాకేమో కృష్ణసాన్నిధ్యం స్వర్గతుల్యంగా వుండేది ఆతని రాక అతని మాటలు నాలో అనిర్వచనీయమైన ఆనందాన్ని కల్గించేవి అతన్ని చూడని ఒక్క సెలవుదినం ఒక యుగంగా జీవితమే నిస్సారమన్నట్లు గడిచేది నాకు ఎన్నడూ లేనిది శ్రీవారు మెల్లి మెల్లిగా చీవాట్లు పెట్టసాగారు నన్ను - రోజూ అలా పరాయి మగాళ్ళతో బాతాఖానీ ఏమిటని? పైగా యింట్లో ఆడపిల్ల వుందికదా అంటూ—

నాకు కోపం పంతం అసలే ఎక్కువేమో అతని మాటలు ఎందుకు లక్ష్యపెట్టాలన్న వుద్దేశ్యంతో ఎప్పటిలా మెలుగుతూనేవున్నాను

కృష్ణ రాగానే తను అయిష్టంగా మొహం పెట్టేవారు విసురుగా యింట్లోంచి వెళ్ళిపోయేవారు

ప్రేమ మైకం పూర్తిగా ఆవరించిన నేను అవన్నీ లక్ష్యపెట్టే స్థితిలో లేను నా చెవుల్లో ప్రతిధ్వనించేది కృష్ణ మాటలే.

"గృహజీవితం నరకప్రాయమై పోయింది నాకు వసుమతిగారూ! మీ ఆప్యాయతలో, ఆదరణలో సేద తీర్చుకోవాలి నేను మీరు కాదంటే నేనేమైపోతానో" అంటూ జాలిగా అతని అభ్యర్ధన అగ్నిసాక్షిగా వివాహమాడిన భర్తకూ, అతని సంతానానికీ పరువు మర్యాదలతో బ్రతుకుతున్న కుటుంబానికీ అతని భార్యకూ ద్రోహం చేస్తున్నానన్న ఆలోచన

రాగానే మనసంతా కకావికలై పోయేది. అతనితో స్నేహం మానేద్దామనీ, నాతో తన పరిచయాన్ని మరచిపొమ్మందామనీ ఎంతో ప్రయత్నించేదాన్ని. కానీ అతన్ని చూడగానే అతని తలపులు మనసుకు రాగానే నేను ఓడిపోయేదాన్ని. భౌతికంగా మాకెలాంటి సంబంధమూ లేనే లేదని కేవలం మానసికమైన సంబంధమేననీ మనసును తృప్తిపరచుకునేదాన్ని.

"స్త్రీకి పూర్వపు కట్టుబాట్లు యిప్పుడు లేవు వసుమతిగారూ! సంఘంలో స్త్రీ పరిస్థితి మునుపటికీ యిప్పటికీ ఎంతో మారింది. మన యీ స్నేహం బహిర్గతం కానంతవరకు తప్పని నేననుకోను. పాపమనీ, దగా అనీ మనల్ని మనమే వంచించుకోవడం తప్పు" అనేవాడు కృష్ణ.

ఆఖరికి నేను అతనికి నా సర్వస్వాన్నీ అర్పించడానికి సిద్ధమయ్యాను. అతని కోర్కె తీర్చలేని నా జీవితం వృధా అనుకున్నాను.

ఆనాడు మొట్ట మొదట మేమిరువురం ఏకాంతాన స్పర్శానందాన్ని అనుభవించాం. అతని పెదిమలు నా పెదాలను తాకాయి. గాఢ పరిష్వంగంలో మైమరచాం యిద్దరం.

ఏదో మత్తు - మైకం - శరీరాకర్షణకూ, తాత్కాలిక అనుభూతులకూ లొంగే వయస్సు కాదు. భౌతిక సుఖాలకు కొత్తవాళ్ళము కాము-అయినా అదో మధురానుభూతి. విపరీతమైన ఆనందం. జీవితమంతా అతని సాన్నిధ్యంలోనే వుండిపోతే-అన్న ఆలోచన.

ఇంతలో పిల్లలు వచ్చిన సందడి. చెళ్ళున కొరడాతో చరచినట్లు మేల్కొంది వివేకం. పిల్లల దృష్టిలో బడకుండా యిద్దరం సర్దుకున్నాం.

కృష్ణతో నా సాన్నిహిత్యం ఎక్కువయిన కొద్దీ మావారికీ నాకూ దూరం యేర్పడసాగింది. ఎవరూ వూహించలేనంత, ఎవరికీ చెప్పుకోలేని సంఘర్షణ నాలో ఆరంభమైంది. కట్టుకున్న భర్తకూ, సామాజిక విలువలకూ ద్రోహం చేస్తున్నాననే భావన ఒకవంక, నేను కావాలనుకున్న నన్ను కావాలనుకున్న నా హృదయాన్నీ నాలోని అణువణువునూ స్పందింపజేసే కృష్ణమీది వ్యామోహం మరోవైపు. పైకి నవ్వుతూ, తుళ్ళుతూ వున్నా ఏదో దిగులు. ఈ కథ యెలా ముగుస్తుందా? ఈ నాటకానికి అంతం యెప్పుడా అని ఆలోచన. ఇంటిపనీ, వుద్యోగ నిర్వహణ అంతరాయంగా- గుబులు.

కానీ "కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లు" ఆనాడు అనుకోనివిధంగా జరిగిన సంఘటన నా ప్రశ్నకు జవాబు చెప్పింది.

రోజు రోజుకూ వారి ప్రవర్తన కఠినంగా తయారయింది. కృష్ణను యింటికి రానిస్తే తను యెక్కడికయినా వెళ్ళిపోక తప్పదన్నారు. నామీద ఎప్పటికప్పుడే నిఘా వేస్తున్నారు. నాలో పంతం కసీ, పెరిగిపోయాయి. కానీ సాంఘిక విలువలనూ, వ్యవస్థనూ కాదనలేను. కాదని మనలేనని నాకు తెలుసు.

అందుకే ఆనాడు నిర్ణయించుకున్నాను- "కృష్ణా-నేను నీకు అందలేను. కనిపించని సంకెళ్ళు నన్ను అన్నివైపులా బంధించి వున్నాయి. భౌతికంగా మనం యెంతో దూరం వున్నా మానసికంగా యిద్దరం ఒకటే" అని చెప్పాలని!

అందుకే - అందరికంటే ముందు బడికి వెళ్ళాను. అనుకున్నట్లుగానే కృష్ణ ఒక్కడే వున్నాడు.

కానీ ఒంటరిగా అతన్ని చూడగానే నాలో వుద్రేకం పొంగింది. చెప్పదలుచుకున్న మాటలేవీ నోట్లోంచి యివతలకి రాలేదు. అతని గుండెలపై తల దాచుకుని రోదించసాగాను.

అలాంటి సమయంలో ఎవరిదో దగ్గు వినిపించి నిశ్చేష్టులమై విడిపోయాము. అసలే పిరికితనం. ఇక ఆ వ్యక్తి తాను చూచిన దృశ్యాన్ని చిలవలు పలవలుగా వర్ణించి చెప్పక మానడు అందరితోటీ. సంఘంలో పరువు ప్రతిష్ఠలతో బ్రతుకుతున్న యిద్దరి కుటుంబాలూ యిక వీధిన పడ్డట్టే అనుకుంటూ భయంతో వణుకుతున్న నేను సెలవు కాగితం యిచ్చేసి ఇంటికి చేరాను.


ఏనాడూ యిటువంటి తప్పు చేయని నేను యిక దుఃఖాన్ని అణచుకోలేకపోయాను. నిజాన్ని దాచుకోలేక జరిగిందంతా అమాయకంగా ఆయన ముందు పెట్టాను. కానీ అన్ని వేళలా నిజం చెబితే జరిగే అనర్థ మేమిటో నా కప్పుడే తెలిసింది.

అంతవరకూ మనసులో దాచుకున్న తన ఆలోచనలనూ, ఆవేశాన్నీ వెళ్ళగ్రక్కేశారు ఆయన. మా యిద్దరిలో అలాంటి భావాలున్నాయని ఎప్పుడో పసిగట్టేశాననీ, యిక కృష్ణ మా యింటికి రావడం కానీ, నాతో చనువుగా వుండడంగానీ సహించలేననీ చెప్పేశారు.

"పదేళ్ళనుంచీ నేను నిన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నానో మాటలతో చెప్పలేను వసూ! నీపై నాకేనాడూ ఎవరితో యెంత స్వేచ్ఛగా ప్రవర్తించినా అనుమానం అన్నదే కలుగలేదు. కానీ యీనాడు నేను నీకిచ్చిన స్వతంత్రాన్ని దుర్వినియోగం చేసుకున్నావు. నా మనసుకు నీవు కలిగించిన గాయ మెన్నటికీ మానదు. అయినా నాలో నీకంత అసంతృప్తి కలిగించే గుణాలేమున్నాయి వసూ! కృష్ణ నాకన్న అందగాడా, ధనవంతుడా, విద్యావంతుడా? యేమిటి చూచి అతని ఆకర్షణలో పడ్డావు? జరిగిందెలాగూ జరిగిపోయింది. ఇకమీదటయినా జాగ్రత్తగా వుండు. సంఘంలో మనకున్న పరువు మర్యాదలను నిలబెట్టు. పిల్లల భవిష్యత్తును పాడుచేసే అధికారం నీకు లేదు వసూ!" అని చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి యేడ్చాడు.

నిజమే-ఆయన చెప్పిందంతా నిజమే. కానీ కోతిలాంటి మనసు ఆ మాటలను పెడచెవిని పెట్టమంటుంది. ఇంగితం బాధ్యతలూ, బంధాలపట్ల మొగ్గుతుంది. ఈ రెండింటి ఘర్షణలమధ్య నలిగి నలిగి నీరసించిపోయాను నేను. నా స్వార్థం కోసం, నా మానసిక సంతృప్తి కోసం కుటుంబ గౌరవాన్ని బలి చెయడం బుద్ధితక్కువ అని తెలుసుకున్నాను.

ఆఖరుకు కృష్ణను యింటికి పిలిపించి నన్ను పూర్తిగా మరచిపొమ్మనీ, తనలో లేనిపోని



"నువ్వీ పెట్టెలో పడుకో రాజం!! అప్పుడు మనం. రైలుకు ఒక్క టికట్ కొంటే చాలు!!!

ఆశలు రగిలించిన నన్ను క్షమించమనీ వేడుకున్నాను.

ఆయన కూడా కృష్ణను అర్థించారు-ఆదేశించారు. తన కుటుంబ శ్రేయస్సుకై సహకరించమని కోరారు. పరిస్థితులన్నీ అర్థంచేసుకున్న కృష్ణ క్రమంగా మా యింటికి రాకపోకలు తగ్గించాడు. తన చుట్టూ గిరిగీసుకున్నట్లు నాతో దూరదూరంగా మెలగసాగాడు. కానీ-నేను మాత్రం అతన్ని మరచిపోలేక - కొన్ని సందర్భాలలో అతను నన్ను చిన్నచూపు చూస్తున్నాడన్న భావన- కలతపెట్టగా విచిత్రమైన ప్రవర్తనకు అలవాటు పడ్డాను. అందరితోనూ కలహించడం - ముఖ్యంగా ఏ చిన్న విషయంలోనైనా సరే కృష్ణతో దెబ్బలాడ్డం. నా చుట్టూ వున్నవాళ్ళు నన్ను చూచి పరిహసిస్తున్నట్లు వూహించేదాన్ని. ఇక యిలా అయితే నాకు పిచ్చెత్తిపోతుందేమోనన్న భయం కలిగేది. ఆత్మహత్య ప్రయత్నాలు కూడా చేయక పోలేదు- కానీ - పిల్లలు, నన్ను నమ్ముకున్న మావారు నేను లేకపోతే దిక్కుకొకరుగా చెల్లాచెదరవుతున్నారన్న ఆలోచన వచ్చి అదీ విరమించుకున్నాను. తప్పనిసరిగా వుద్యోగం మానేశాను. ఇంటిపనికి తోడుగా పుస్తకాలు చదవడం-అప్పుడప్పుడు చిన్నచిన్న రచనలు చేయడం వ్యాపకమైంది నాకు. క్రమంగా కృష్ణను గురించిన ఆలోచనలు కొంతవరకు స్మృతిపథంలో నుంచి తొలగిపోయినా - కృష్ణ

బదిలీచేయించుకు వెళ్ళినా యేదో చెప్పలేని అభిమానం—

అతన్ని పదేపదే చూడాలని కోరిక.

అతని సాహచర్యాన్ని పొందలేకపోయా నన్న తపన-వివాహమనే యీ పసిడి పంజరంపై అలుక-'ప్రేమ' అన్నది మానసికమైన అను భూతి. దానికి వయస్సూ, పరిస్థితులు అడ్డురావు. అలాంటప్పుడు ఆ ప్రేమ భావవాహినికి అడ్డు కట్ట వేయమనే హక్కు ఈ సంఘానికెవ రిచ్చారు? వివాహితులైనంత మాత్రాన ప్రేమ భావన నశించిపోవాల్సిందేనా? అన్న ఆలో చనలో తేలుతున్న నన్ను తలుపుపై టకటకలు యీ లోకంలోకి తెచ్చాయి. తలుపు తెరిచి చూద్దును గదా! ఎవరో కుర్రవాడు. "అమ్మా అక్కడ చెట్టుకింద నిల్చున్న బాబుగారు మీకీ వుత్తరం యిమ్మన్నారు" అంటూ మడతపెట్టిన కాగితం ఒకటి యిచ్చాడు.

దూరంగా చెట్టుకింద నిలబడ్డ మనిషెవరో నేను పోల్చుకోలేకపోయాను. కాగితం విప్పి చూద్దాను గదా!

"వసుమతిగారూ?

మిమ్మల్ని చూడాలనే లతగారి యింటినుంచి యిక్కడిదాకా వచ్చాను. కాని శ్రీహరిగారు నాకు యిప్పుడే స్టేషనులో కనిపించారు. ఈ యేడెనిమిది సంవత్సరాల మన మధ్యదూరం ఆయనకు నాపై కోపాన్ని పోగొట్టి వుంటుం దనీ పూర్వపు ఆ గాధను మరచి నన్ను ఎప్ప టిలా పలకరిస్తారనీ వూహించి సంతోషంగా దగ్గరకు వెళ్ళాను. కానీ నా దురదృష్టం అతను నన్ను చూడగానే మొహంలో వ్యక్తంచేసిన అసహ్యం, క్రోధం నన్ను కలవరపెట్టాయి. మునుపోసారి మీ జీవితంలో ప్రవేశించి మీ దాంపత్యజీవితాన్ని కలుషితం చేశాను. ఇప్పుడు మళ్ళీ అమృత కలశంలో విషబిందువులా ప్రవే శించి మళ్ళీ మిమ్మల్ని కలతలపాలు చేయడం నాకు భావ్యంకాదు. అందుకే యింటిదాకా వచ్చి మీతో మాట్లాడాలని వున్నా ఆ కోరికను బలవంతాన చంపుకుంటున్నాను. ఆయన ఇంట్లో లేనప్పుడు మీతో ఒంటరిగా మాట్లాడం మీకు అపకారం తలపెట్టినట్లే - మీ జీవితం సుఖ మయం కావాలనీ మీ దాంపత్యం అన్యోన్యంగా వుండాలనే కాంక్షించే—

'కృష్ణ'

ఉత్తరం చదవగానే నా కళ్ళు శ్రావణ మేఘాల్లా వర్షించసాగాయి. తలెత్తి చూస్తే కృష్ణ వడివడిగా వెళ్ళిపోతున్నాడు. ఒక్కసారి రమ్మని ఎలుగెత్తి పిలిస్తే పిలుపు అందనంత దూరంలో అతను.

ఉత్తరం తెచ్చిన కుర్రవాడిని పంపుదామని ప్రక్కకు తిరిగిచూస్తే వాడెప్పుడో వెళ్ళి పోయాడు. వుత్తరం చింపి వుండలుచేసి విసిరే శాను. కన్నీళ్ళతో బరువెక్కిన హృదయంలో అలా ఎంతసేపో నిల్చున్నాను. ఇంత సమీ పానికి వచ్చికూడా కృష్ణతో మాట్లాడలేక పోయిన దురదృష్టం నన్ను వెక్కిరించింది.

అలాగే ఆలోచిస్తూ నిల్చున్న నేను ఆటో ఆగిన చప్పుడుతో వీధిలోకి చూశాను ఎవరా అని!

మరెవరో కాదు వారే-క్యాంపు కాన్సిలైంది కాబోలును.

గబగబా కన్నీరు తుడుచుకుని బలవంతాన నవ్వు పులుముకుని తనకెదురుగా వెళ్ళాను. సూట్‌కేసందుకుని "ఏమిటి క్యాంపు అయి పోయిందా?" అని ప్రశ్నించాను.

"మరో అర్జెంటు పనివుండి మానేశానులే- ఏమిటి తీరిగ్గా నిల్చుని ఆలోచిస్తున్నావ్" అంటూ లోపలికెళ్ళారు.

నాకు అర్థమైంది ఆయన ఎందుకు వచ్చారో క్యాంపు మానుకుని-కృష్ణ రాలేదనీ నన్ను కలు సుకోలేదనీ నేను చెప్పినా నమ్మరు. మళ్ళీ మొదలు అనుకుంటూ ఆయన వెనకే లోపలికి వెళ్ళాను నేను.

సాంఘికపరమైన కట్టుబాట్లకూ
వైవాహిక బంధానికీ—

నా మెడతో తాళికట్టి నాపై అధికారాన్ని సంపాదించిన మా వారికీ—

నా కడుపు చించుకు పుట్టిన నా పిల్లల మమతాను రాగాలకూ బందీని నేను. నేనేకాదు. మన భారతదేశంలోని ప్రతిస్త్రీ కూడా యించు మించు నాలాంటి కోవకు చెందిందే. □